# షాక్

అబ్బో, ఎప్పటిమాట యిది! సుమారు నలభై సంవత్సరాల క్రిందటి వ్యవహారం.

ఇంత జీవితం గడిపి రిటైరయి విశ్రాంతిగా జీవితం గడుపుతున్న ఈ సమయంలో ఆ వృత్తాంతం అంతా గుర్తుకు వస్తున్నది.

ఉదయంలేచి కాలకృత్యాలు తీర్చుకుని తీరుబడిగా పేపరు ఆమూలాగ్రం చదివి విసుగుపుట్టి ఆవులించి చేతివ్రేళ్లు విరుచుకుని వాలుకుర్చీలో వెనక్కు వాలి కళ్లు మూసుకున్నాను. అప్పుడు గుర్తుకు వచ్చాడొక వ్యక్తి...కరుణాకరన్...ఇంట్లో ఉదయం ప్రారంభమైన సందడీ ఆర్భాటమూ అంతా సద్దుమణిగింది. మా పెద్దబ్బాయి తెల్లవారుజామునే లేస్తాడు. ఆ తర్వాత ఇక ఎవ్వరినీ నిద్రపోనివ్వడు. కోడలు సరేసరి లేచీ లేవగానే వంట ప్రారంభం చేస్తుంది. ఇంటిల్లిపాదికి కాఫీలు వగైరా సరఫరాచేసి యంత్రంలాగా తొమ్మిది గంటలలోపునే వంట పూర్తి చేస్తుంది. మా రెండోవాడు ఎనిమదిన్నర కల్లా తయారై ఉరుకులు పరుగులుగా వెళ్ళిపోతాడు. మా అమ్మాయి త్వరత్వరగా తయారై పుస్తకాలు తీసుకుని తొమ్మిది గంటలకల్లా కాలేజీకి వెళ్ళిపోతుంది. పిల్లలు చేసినంత గొడవ చేసి తలా ఒక సంచీ భుజాన తగిలించుకుని స్కూళ్ళకు వెళ్ళిపోతారు. తొమ్మిదిన్నర అయ్యేసరికి అందరూ వెళ్ళిపోతారు. ఇక ఇంట్లో మిగిలేది నేను. అక్కడి నుంచి ఏమీ తోచి చావదు. నిముషం గడవటానికి గంట పడుతుందని పిస్తుంది. నిర్వ్యాపారంగా కూర్చోవడం, అలసిపోయినప్పుడు పడుకోడం, మరి కాస్సేపు ఏదో చదువుకోడం...ఇంకా విసుగుపుడితే మరింత విసుగుపుట్టించే రేడియో వినడం...ఇదీ తంతు.

◆ ◆ ◆ ◆ ◆ ◆

ఇవ్వేళ ఎందుకో మనసంతా హాయిగా వుంది.

కరుణాకరన్ గుర్తుకు వచ్చాడు. ఇన్ని యేళ్ళుగా మనసనే మహా సముద్రంలో ఏదో ఒకమూల పడిపోయి మరుగునపడిపోయిన వ్యక్తి.

సన్నగా పచ్చగా పొడగ్గా వుండేవాడు.సన్నని ఫ్రేముగల కళ్ళద్దాలు పెట్టుకునేవాడు. నున్నని గడ్డంతో మడత నలగని దుస్తులతో శుభ్రంగా ఉండేవాడు. చాలా నెమ్మదిగా ముక్త సరిగా మాట్లాడేవాడు.

అప్పుడు నేనెలా ఉండేవాణ్ణి? చదువుముగించి ఉద్యోగంలో చేరిన కొత్తరోజులు... హుషారుగా ఉండేది. కొత్తగా సిగరెట్ కాల్చటం అలవాటు చేసుకున్న రోజులు... వయసు అనే పంచకళ్యాణి గుర్రం మీద ఎక్కి సరదాగా ఆకాశ సంచారం చేస్తున్నట్టు కలలుగనే

రోజులు... ప్రపంచం అంతా పచ్చపచ్చగా హాయిగా కనిపించేరోజులు. కాలేజీ చదువు సాగించినన్నాళ్ళూ అందరి విద్యార్థుల లాగానే బేఫర్వాగా నిష్పూచీగా ఉండేవాణ్ణి. నిరంతరం వాదనలతో వాగ్యుద్ధాలతో కాలం గడిపేవాణ్ణి. భారతంలో దుర్యోధనుడు, రామాయణంలో రావణుడే నన్ను ఎక్కువగా ఆకర్షించేవారు. విశృంఖలత్వం ఎక్కువగా ఆకర్షించేది. అయితే పుట్టి పెరుగుతున్నది మామూలు మధ్యతరగతి సంసారంలో కావడంచేత చదువువిషయంలో జాగ్రత్తగానే వుండేవాణ్ణి. ఆ రోజుల్లోనే ఒక చిన్న కథ విన్నాను. తండ్రి తన అయిదేళ్ళ కొడుకును మొదటిసారిగా బడికి పంపిస్తున్నాడు. కుర్రవాడు కొత్తదుస్తులతో కొత్త పలకా బలపాలతో బడికి వెళ్ళే హుషారులో ఉన్నాడు. తీరా తయారై బడికి బయలుదేరేముందు తండ్రి కొడుకును కొంచెం ఎత్తయిన అరుగుమీద నిలబెట్టి చేతులు చాపి "దూకు...పట్టుకుంటాను..." అన్నాడు. కుర్రవాడు ఒక్క ఉదుటున దూకాడు. కాని తండ్రి వాణ్ణి పట్టుకోలేదు. వాడు క్రిందపడ్డాడు. ఏడుస్తూ "పట్టుకోలేదేం నాన్నా" అని తండ్రిని అడిగాడు. తండ్రి నవ్వి "బడికి మొదటిసారిగా పోతున్నావు. నీకిది మొదటిపాఠం...ఎవర్నీ నమ్మకు..." అన్నాడు.

నేను గ్రాడ్యుయేట్‌నయి గర్వంతో కొన్నాళ్ళపాటు ఇంటిదగ్గర ఉన్నాను. ఫస్టుక్లాసులో పాసైనానని నేను మా పెద్దలూ కొంతకాలం గర్వించాంకాని తర్వాత తర్వాత ఇరుగూ పొరుగూ 'మీవాడేమీ చెయ్యడంలేదా?' అనడం మొదలుపెట్టడంతో వాంటెడ్ కాలమ్స్ చూడటం వివిధ సంస్థలకు, రకరకాల డిపార్టుమెంటులకు అప్లికేషన్లు పెట్టడం ప్రారంభమైంది. ఇక రోజూ పోస్టుమాన్ కోసం ఎదురుచూడటం...ఉద్యోగం కోసం నిరీక్షణ.

ఒకనాడు నా కల ఫలించింది. అప్పాయింట్‌మెంట్ ఆర్డరు వచ్చింది. సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం. మంచి జీతం... అంతా బాగానే వుంది...కాని మొదటి పోస్టింగ్ ఎక్కడో దక్షిణాదిన వందల మైళ్ల దూరంలో ఒక మధ్యతరగతి పట్టణంలో...మన ప్రాంతంకాదు...మన ప్రజలు కాదు...మన భాషకాదు. పైగా ఇంట్లో ముసలమ్మల సణుగుడు 'దేశంకాని దేశానికి పసివాణ్ణి పంపడమెలా?' అని. అక్కడికీ అదేదో మరో దేశమైనట్టూ అక్కడికి వెళ్ళినవాళ్ళు తిరిగి రారన్నట్టూ. మా నాన్నా నేను అతి చాకచక్యంగా ఎవరికి చెప్పవలసినవి వాళ్ళకు చెప్పి ఎట్టకేలకు జయించాం. అందరిని ఒప్పించాం కానీ మా నాయనమ్మను ఒప్పించడానికి పెద్దపెద్దఇండియా మ్యాపులూ గ్లోబులూ ఉపయోగించవలసివచ్చింది. అదీ మనదేశంలోని భాగమేననీ అక్కడా మనలాంటి మనుషులే ఉన్నారనీ చెప్పి ఒప్పించేందుకు ఇంటిల్లపాదీ నానా హైరానా పడ్డాం...చివరకు అనేక హెచ్చరికల తర్వాత ప్రబోధాల తర్వాత ప్రయాణం నిశ్చయమైంది.

మొట్టమొదటిసారి జీవితంలో ఒంటరిగా అంతదూరం ప్రయాణం చేయడం మంచి థ్రిల్ అనిపించింది.

అంతా సజావుగా జరిగి మూడురోజుల ప్రయాణం తర్వాత గమ్యస్థానం చేరుకుని వారినీ వీరినీ వాకబుచేసి నేను ఆఫీసుకే వెళ్ళాను.

ఒక మోస్తారుగా పెద్దదే ఆఫీసు...అవసరమైనవారిని కలుసుకుని ఉద్యోగంలో జాయినైనాను. అప్పటికప్పుడే ఒక కుర్చీ కూడా ఆక్రమించేశాను.

సాయంకాలంవేళకు చుట్టుపక్కల వారితో ముక్తసరి సంభాషణతో ఒక విషయం తెలిసింది. అంత ఆఫీసులో వేరే వింగ్‌లో తెలుగు తెలిసిన వ్యక్తి ఒకరున్నారని. అతనొక పెద్దఆఫీసరని, పేరు కరుణాకరన్ అనీ...

అతనికోసం వెతుక్కుంటూ వెళ్ళాను. స్వింగ్‌డోర్ తీసుకుని లోపలికి వెళ్ళగానే తల పైకెత్తి చూసి కూర్చోమని సైగ చేశాడు. కూర్చుని నన్ను నేను పరిచయం చేసుకున్నాను. చిరునవ్వు నవ్వాడు. 'మంచిది...మీరిక్కడ ఫారినర్‌గా ఫీల్ కానక్కరలేదు. మేము తెలుగువాళ్లం కాదు కాని తెలుగుదేశంలో కొంతకాలం ఉన్నాం. నా చిన్నతనమంతా తెనాలి, గుంటూరులలో గడిచింది. ఇక ఇక్కడ హాయిగా ఉండండి. అన్నట్టు మీరుండడానికి ఒక రూము ఏర్పాట్లు చూద్దాం...ఆఫీసు అవగానే కలిసే వెళదాం...' అన్నాడు.

నాకు కొండెక్కినంత సంతోషమయింది. పరాయిచోట పెద్ద అండ దొరికిందనిపించి హాయిగా నిట్టూర్చాను.

ఆయన అన్నమాట ప్రకారం ఆనాడు సాయంకాలమే నన్ను వెంటబెట్టుకుని తనకు తెలిసినవారి యింట్లో చక్కని రూము కుదిర్చిపెట్టారు. ఇంటి గలవారికి నన్ను గురించి చక్కగా పరిచయం చేశాడు.

ఆ రాత్రి గదిలో అన్నీ సర్దుకొని, వసతిగా పడుకుని అతన్ని గురించే ఆలోచించాను. ఆ కొద్ది గంటల పరిచయంలో అతన్ని అంచనా వేశాను.

కరుణాకరన్ మంచివాడు. అయితే మొహమాటి. ముక్తసరిగా లిమిట్స్‌లో ఉంటాడు. ఆఫీసు నుంచి ఆ సాయంకాలం హోటల్‌కు వెళ్ళాం. అక్కడ కాఫ్యాదులు సేవించిన తర్వాత ఎవరి బిల్లు వారికే తెప్పించాడు. బయట నేను సిగరెట్ కొంటూవుంటే నావంక అతడు చూసిన చూపు నన్ను కలత పెట్టింది. ఇలాంటి అలవాట్లు కూడా ఉన్నాయా?' అన్నట్టు చూశాడు. అతనికి ఆఫర్ చెయ్యబోగా మొహం తిప్పుకుని 'సారీ, అలవాటులేదు' అన్నాడు.

ఆ రాత్రి నిశ్చింతగా హాయిగా నిద్రపోయాను. మరునాడూ ఆ మరునాడూ ఆఫీసులో కలుసుకుని 'వీలైనంత తొందర్లో మా ప్రాంతానికి ట్రాన్స్‌ఫర్ అయ్యేట్లు ప్రయత్నించమని ' మాటల సందర్భంలో అర్థించాను. 'అలాగే... చూద్దాం' అన్నాడు.

అంతవరకూ మామూలు కథ...

పాత సాదా కథ. అది నాలుగైదు రోజుల్లో వింత మలుపు తిరిగింది.

ఆ రోజు ఉదయం ఆఫీసుకు వెళ్ళేందుకు తయారవుతున్నాను. వీధి గుమ్మంలోకి ఒక సైకిలు రివ్వున వచ్చి ఆగింది. కరుణాకరన్ సైకిల్ స్టాండ్ వేసి లోపలికి వస్తున్నాడు. అతని చేతిలో సిగరెట్ వెలుగుతున్నది. రెండో చేతిలో ఖరీదైన సిగరెట్ ప్యాకెట్ ఉంది.

మెట్లెక్కి వస్తూనే నన్ను చూసి 'మీరేనా వాసుదేవరావ్?'అని అడిగాడు. నాకు మతిపోయినట్టయింది. కళ్ళు పెద్దవి చేసుకుని వింతగా చూశాను.

అతను అంతలో నవ్వి సిగరెట్ పొగ వదులుతూ కూర్చుని 'సారీ, మీరు కంగారు పడుతున్నట్టున్నారు. లెట్ మీ ఇంట్రడ్యూస్ మైసెల్ఫ్... నా పేరు కమలాకరన్... కరుణాకరన్ మా అన్నగారు... మేమిద్దరం కవలలం... మా అన్నయ్య నాకంటే రెండు నిమిషాలు పెద్దవాడు... సరేనా? మిమ్మల్ని కలుసుకోవడం ఎంతో సంతోషంగా వుంది. ఇక్కడ ఫ్రెండ్స్ లేక విసుగుపుడుతున్నది. ఇక మీరు దొరికారు అన్నట్టు మా అన్నయ్య మీకీ లీవ్‌లెటర్ ఇచ్చిరమ్మని పంపాడు. వాడికి పని పడింది ఇంట్లో...' అంటూ సెలవు చీటి అందించాడు. ఆ తర్వాత పది నిమిషాల సేపు కూర్చుని మాట్లాడి వచ్చినంత వేగంగానూ సైకిలు మీద వెళ్ళిపోయాడు. వెళ్ళేముందు ఆనాడు సాయంకాలం రూముకు వస్తాననీ ఆఫీసు నుంచి వచ్చి తనకోసం వుండమనీ 'ఎట్టైనా' సరదాగా వెళ్ళి కాలక్షేపం చేద్దామనీ అన్నాడు. మాట్లాడుతున్నంతసేపూ సిగరెట్ తర్వాత సిగరెట్ వూదేశాడు.

నేను కొన్ని నిమిషాలు దిగ్భ్రాంతితో నిలబడిపోయాను. కాస్సేపటిలో అన్నాదమ్ముల మధ్య తేడా కొట్టొచ్చినట్టు కనిపించింది.

అతడు మితభాషి, ఇతడు మాటలపోగు.

అతను సిగరెట్‌కూడా తాగని మంచివాడు. ఇతను వ్యసనపరుడు. ఆనాడు ఆఫీసు నుంచి తిరిగివచ్చేసరికి రూము దగ్గర వెయిట్ చేస్తున్నాడు కమలాకరన్ సిగరెట్లు ఊదేస్తూ.

నేను మొహం కడుక్కుని తయారైన తర్వాత ఊరిమీదకి బయలుదేరదీశాడు. ముందు ఖరీదైన హోటలూ ఆ తర్వాత సినిమా... మధ్యలో విపరీతమైన వాగుడు. సిగరెట్లకూ కాఫీలకూ సినిమాలకూ పైసా కూడా నన్ను ఖర్చుపెట్టనీయలేదు. అలా మా యిద్దరి మధ్య ప్రారంభమైన పరిచయం రోజుల వ్యవధిలో గట్టిపడింది. అతను రావడం కొద్ది నిమిషాలు ఆలస్యమైతే పిచ్చెక్కినట్టయ్యేది నాకు.

క్రమంగా రోజులు గడిచేకొద్దీ ఆఫీసులో కరుణాకరన్‌ను కలుసుకోవడం బొత్తిగా తగ్గిపోయింది. ఒకరోజు ఆఫీసులో కనబడ్డప్పుడు కరుణాకరన్ నన్ను తనతో రమ్మన్నాడు. వెళ్ళి కూర్చున్నాను. అతడొక్క క్షణం ఆగి 'మీ ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నిస్తున్నాను. త్వరలోనే పని జరగవచ్చు..." అన్నాడు. నేను ఆనందంతో "థాంక్యూ" అన్నాను.

అతడు మళ్ళీ "మా తమ్ముడితో మీకు బాగా దోస్తీ కుదిరినట్టుందే..." అన్నాడు.

"అవునండీ ఆయన మంచి హుషారైన వ్యక్తి...

అతడు ఎటో చూస్తూ "అవును హుషారైనవాడే! మరీ మోతాదు మించిన ఘుషారు. మెడికల్ రిప్రజెంటేటివ్ కదా బోలెడంత డబ్బు..... చేతినిండా తీరిక... బాధ్యతలు తెలీవు... ఏమీ పట్టించుకోడు... ఇంటి గొడవలు... అవి ఏమీ పట్టవు... డబ్బును మంచినీళ్ళ కన్నా అన్యాయంగా దుబారా చేస్తాడు..." అన్నాడు.

నేనేమీ మాట్లాడలేదు. కాస్సేపు కూర్చుని వచ్చేశాను. ఆనాడు సాయంకాలం కమలాకరన్‌తో హో లుల్లో కూర్చుని వున్నప్పుడు ఈ ప్రసంగం ఎత్తాను. అతని అన్న తనను గురించి అన్న మాటలు చెప్పగానే అతడు నవ్వి సిగరెట్ ముట్టించుకుని "మా వాడి సంగతి నాకు చెప్పకండి. వొట్టి బుద్ధూగాడు. ఇల్లూవాకిలీ తప్ప ఏమీ ఎరగడు. నాటకమూ, సినిమా, షికారు ఏమీలేదు...జీవితం అనుభవించటం తెలీని బడుద్ధాయి" అన్నాడు.

నా మనస్సు చివుక్కుమన్నది. నేనేమీ మాట్లాడలేదు.

రోజులు హుషారుగా హడావిడిగా గడిచాయి.

ఉన్నట్టుండి ఒకరోజున ఆఫీసుకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు అందాయి. ఆత్రుతగా అందుకుని చూశాను. మన ప్రాంతాలకు నన్ను మార్చారు. ఆనందంగా కరుణాకరన్ గార్కి చెప్పి కృతజ్ఞతలు తెలియజేద్దామని పరుగెత్తాను. దురదృష్టవశాత్తు అతడులేడు. ఆనాడు సెలవు పెట్టాడు. సాయంకాలం రూముకు వెళ్ళగానే సామాన్లు సర్దుకోవడం మొదలుపెట్టాను. మరునాడు ఉదయమే ప్రయాణం. కమలాకరన్ హడావిడిగా వచ్చాడు. 'ఏమండీ... మీకు ట్రాన్స్‌ఫర్ అయిందట...సంతోషమే...కాని ఇక్కడ నాకున్న బెస్ట్‌ఫ్రెండ్ ఒక్కరూ దూరంగా వెళ్ళిపోతున్నారే అని నా బెంగ. రియల్లీ ఐ మిస్ యూ వెరీమచ్...' అన్నాడు. నేను నొచ్చుకున్నాను.'అన్నట్టు ఇదంతా మీ అన్నగారి చలవే... చాలసాయం చేశారు. థాంక్స్ చెబుదామనుకున్నాను. ఆయన ఆఫీసుకు రాలేదు. ఇంటికి వెళ్ళివద్దామా ఒకసారి?" అని అడిగాను.

లాభం లేదు వాడు ఊళ్ళో లేడు. రెండు మూడు రోజులకుగాని రాడు. అత్తా రింటికిపోయాడు. లేకపోవడం అయినా ఫరవాలేదులెండి. 'నేను చెబుతా లెండి'... అన్నాడు కమలాకరన్.

ఆ సాయంకాలం హుషారుగా కాలక్షేపం చేశాము. అతను ఆ రాత్రి పొద్దుపోయేదాకా నాతోనే వుండి సామాన్లు సర్దడంలో సాయపడ్డాడు. మర్నాడు స్టేషన్‌కి త్వరగా వస్తానని వెళ్ళిపోయాడు.

మర్నాడు స్టేషన్లో... రైలు కదలబోతున్నది. ఇద్దరం ప్లాట్‌ఫారం మీద నిలబడివున్నాము.

నేనన్నాను, చాలా థ్యాంక్సండీ... ఇక్కడున్న నెలా పదిహేనురోజులూ మీరు అద్భుతమైన కంపెనీ యిచ్చారు. ఆనందంగా గడిచింది. అన్నట్టు మీ బ్రదర్ సమయానికి లేకపోవడం నా దురదృష్టం... మీరు చెప్పండి. ఆయన చేసిన సహాయానికి ఎంతో కృతజ్ఞుణ్ణి...!'

రైలు కదలబోతుండగా కిటికీ దగ్గర కూర్చున్నాను.

'మా అన్నయ్య లేడని బాధపడకండి నేను చెబుతానన్నానుగా...నిశ్చింతగా వెళ్ళండి...' అన్నాడు కమలాకరన్.

రైలు కదులుతుండగా నా కళ్ళలో నీళ్ళు నిలిచాయి. కమలాకరన్ నా చెయ్యి పట్టుకుని స్నేహపూర్వకంగా నొక్కి వదిలాడు. రైలు కదిలింది. సరిగ్గా అదే సమయంలో ఒక ఉత్తరం నా చేతిలో ఉంచి 'గుడ్‌బై ఆల్ ది బెస్ట్' అన్నాడు. తర్వాత చేయి ఊపుతూ నిలబడ్డాడు.

క్రమంగా దూరమైపోతున్న అతనివైపే చూస్తూ చెయ్యి వూపాను. రైలు వేగం పుంజుకుంది. క్రమేణా క్షణాలమీద స్టేషను కనుమరుగైపోయింది.

అప్పుడా ఉత్తరం విప్పి చూశాను. 'మై డియర్ ఫ్రెండ్... మా అన్నయ్య సమయానికి లేకుండా పోయారే అని బెంగ పడకండి. నేను కరుణాకరాన్నే. నేను చేసిన చిన్న సాయానికి ఎంతో గొప్పగా కృతజ్ఞతలు చెప్పారు. నేను చేసింది అంత పెద్ద సాయమేమీకాదు. చాలా చిన్న విషయం. అన్నట్టు మీరేమీ అనుకోకపోతే అసలు నాకొక తమ్ముడు లేడు. ఉన్నది నేనొక్కణ్ణే. మిమ్మల్ని చూసిన మొదటిరోజునే చిన్న ప్రయోగం చెయ్యాలనిపించింది. విచ్చలవిడితనం, విశృంఖలత్వం మనలని ఆకర్షిస్తాయని నా నమ్మకం. అందుకే సరదాగా మీతో చిన్న నాటకం ఆడాను. గుట్టు బైటపడకుండా ద్విపాత్రాభినయం చేశాను. నా నమ్మకం బలపడింది.

మొత్తానికి మీరు స్వస్థలానికి వెళుతున్నందుకు అభినందనలు. ఎప్పుడన్న ఉత్తరాలు రాస్తూండండీ.

– కరుణాకరన్"

నేను జీవితంలో మొదటి 'షాక్' తిన్నానని వేరే చెప్పనక్కరలేదు.

తర్వాత ఉత్తర ప్రత్యుత్తరాలు ఎక్కువకాలం నడవలేదు.

◆ ◆ ◆ ◆ ◆ ◆

ఇంట్లో హడావిడి మొదలయింది.

మా కుటుంబసభ్యులంతా ఒక్కొక్కరే యింటికి చేరుకుని సందడి చేస్తున్నారు. నేను తేలిక పడిన మనసుతో లోపలికి నడిచాను. స్నానం చేస్తూండగా 'కరుణాకరన్ ...నాకు జీవితంలో మొదటి గుణపాఠం నేర్పిన వ్యక్తి..మొదటి షాక్ యిచ్చిన వ్యక్తి... ఇప్పుడెలా వున్నాడో' అనిపించింది.

అంతలోనే 'అసలున్నాడో లేదో' అని కూడా అనిపించింది.

◆ ◆ ◆